E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 15-06-2025 (వారం) ఆదివారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



10 గంటల నిద్ర అనారోగ్యమే! » 3లో

# చిత్ర పరిశ్రమ గొప్పగా రాణించాలి

## హాలీవుడ్‌కు వేదికవ్వాలి: సీఎం రేవంత్



- అంతర్జాతీయ సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికగా మారాలి: సీఎం రేవంత్
- అందుకు సినీ పెద్దలు కృషిచేయాలి...
- ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది సినిమా అభివృద్ధి కోసమే..
- తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి..
- ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది
- నేను మరో 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా..
- ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా
- తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రసంగించిన సీఎం



ఈ కబురు, హైదరాబాద్: అంతర్జాతీయ సినీ పరిశ్రమ హాలీవుడ్‌కు హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ దిశగా సినీ పెద్దలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ సినిమా అంటే ఒకప్పుడు బాలీవుడ్ అని అందరూ భావించేవారు.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. భారతీయ సినిమాల్లో తెలుగు సినిమా ముందు వరుసలో ఉందని చెప్పారు. ఇకపై బాలీవుడ్‌కు హైదరాబాద్ వేదిక కానుందని పేర్కొన్నారు. శనివారం హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. 2014 నుంచి 2024 వరకు ఉత్తమ చలనచిత్రాలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి 1964లో నంది అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

ఆ అనవాయితీ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగింది. కొన్ని కారణాలవల్ల ఈ అవార్డుల పంపిణీ వాయిదా పడుతూ వచ్చింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక సినీ అవార్డుల ప్రదానంపై నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ఇవాళ గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తరువాయి 2లో

## గద్దర్ అవార్డ్స్ వేడుక.. బన్నీ స్పెషల్ అట్రాక్షన్

తరువాయి 5లో

# నదులు, నిధులు.. రెండూ ఆంధ్రాకేనా?

- బనకచర్ల పేరిట ఏపీ జలదోపిడీపై కాంగ్రెస్ మౌనం ఎందుకు
- కేంద్రం నుంచి ఏపీకి మాట సాయం, మూట సాయం
- రేవంత్‌కు ప్రతిపక్షాలపై ఇరిటేషన్ తప్ప, ఇరిగేషన్‌పై శ్రద్ధ లేదు
- నదీ జలాల్లో అన్యాయంపై కేంద్ర మంత్రులు స్పందించాలి
- తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ఈ కబురు, హైదరాబాద్: గోదావరి నదీ జలాల్లో కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణకు ద్రోహం చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పైసా సాయం చేయలేదని, కానీ ఏపీ అక్రమంగా చేపడుతున్న గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు మాట సాయం, మూట సాయం అందిస్తోందని మండిపడ్డారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ పేరిట ఏపీ చేస్తున్న జల దోపిడి - కాంగ్రెస్ మౌనం'అనే అంశంపై హరీశ్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

**ఇరిటేషన్ తప్ప ఇరిగేషన్ ఎక్కడ?**

'రేవంత్ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని ఇరిటేట్ (అసహనానికి గురిచేయటం) చేయడం తప్ప ఇరిగేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. బనకచర్ల లింక్ ద్వారా గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలించుకుపోతున్నా ప్రతిపక్షాలపై కేసులు, విచారణలు, మంత్రివర్గ విస్తరణ అంటూ సీఎం దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడు. నీటిపారుదలపై అఖిలపక్ష సమావేశానికి ముందుకు రాకుండా తాము సన్నద్ధం కాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్తున్నాడు.

తరువాయి 2లో

# విమాన ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ

అహ్మదాబాద్-లండన్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి, వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని విస్తృత విచారణ చేపట్టడానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పౌరవిమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.



తరువాయి 2లో

# ఆపరేషన్ సిందూర్‌తో వాయుసేన శక్తి చూపాం



కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

- ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్
- దేశానికి ఏ అవసరం వచ్చినా ముందుంటాం
- యువ అధికారులు దేశ సేవకు అంకితం అవ్వాలి
- ఏఎఫ్ఏలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది కేడెట్లు

తరువాయి 2లో


## ఒక్క ఉద్యోగం.. 14 రౌండ్ల ఇంటర్వ్యూ!

» 4లో



## పిజ్జా కంపెనీలో రూ. 1801 కోట్ల షేర్లు అమ్మేసిన ప్రమోటర్లు

» 4లో



## అజిత్‌కి జోడీగా...

» 5లో



## తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్

తొలిరోజు ఎంజీబీఎస్ నుంచి మిర్యాలగూడకు బస్సు నడిపిన సరిత

దేశంలోనూ, తెలంగాణలోనూ తొలి మహిళా ఆర్టీసీ డ్రైవర్‌గా రికార్డు

» 2లో

## రాజకీయ నిఘా కోసమే ఎస్‌వోటీ

» 3లో





## ఇరాన్‌కు రెండో అవకాశం ఇస్తున్నాం

» 3లో



## అమెరికాలో రాజకీయ హత్యలు

అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఇద్దరు చట్టసభ సభ్యులు, వారి జీవిత భాగస్వాములపై కాల్పులు జరిగాయి.

» 2లో

# పీఎఫ్ఆర్‌ను కేంద్రం ఆమోదించిందా?

**'గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)ను కేంద్రం ఆమోదించిందా?**

- బనకచర్ల డీపీఆర్ పంపాలంటూ ఏపీని కోరడం ఆందోళనకరం
- కేంద్ర మంత్రికి ఉత్తమ్ లేఖ
- హరీశ్‌రావు ఆరోపణలను తోసిపుచ్చిన మంత్రి

» 3లో



ఈ కబురు, హైదరాబాద్: 'గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)ను కేంద్రం ఆమోదించిందా? ఈ ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న తరుణంలో సీడబ్ల్యూసీలో చర్చించడం ఆక్షేపణీయం'.. అంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి లేఖ ద్వారా అభ్యంతరం తెలిపారు. ఏపీ పంపిన పీఎఫ్ఆర్‌కు ఆమోదం తెలపకుండానే ఆ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) పంపాలని ఎలా అడిగారంటూ నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. "ఈ నెల 2న కేంద్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ నేతృత్వంలో ఏపీ అధికారులు సమావేశమైనట్లు సమాచారం.

# నీట్ యూజీ తెలంగాణ టాపర్ కాకర్ల జీవన్‌సాయి

- జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు
- రాజస్తాన్ విద్యార్థి మహేశ్‌కుమార్ ఆలిండియా టాపర్...
- ఏపీ టాపర్‌గా నిలిచిన 19వ ర్యాంకర్ కార్తీక్ రామ్‌కిరీటి
- టాప్ 100లో తెలంగాణ నుంచి 5, ఏపీ నుంచి ఆరుగురికి చోటు
- ఫలితాలు ప్రకటించిన ఎన్టీఏ.. మొత్తం 12,36,531 మంది అర్హత
- తెలంగాణ నుంచి 41,584 మంది.. ఏపీ నుంచి 36,776 మంది అర్హులు
- టాప్ టెన్‌లో ఒక్కరే బాలిక.. వచ్చే నెలలో కౌన్సెలింగ్

తరువాయి 3లో



ఈ కబురు, హైదరాబాద్/అమరావతి: దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ ప్రవేశ, అర్హత పరీక్ష (నీట్ -యూజీ)లో రాజస్తాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా కాకర్ల జీవన్ సాయికుమార్ మెరిశాడు. అతడికి జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నేషనల్ 19వ ర్యాంకు సాధించిన కార్తీక్ రామ్‌కిరీటి నిలిచాడు. నీట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. టాప్ వంద లోపు తెలంగాణ నుంచి 5 మంది, ఏపీ నుంచి ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిలో మొత్తంగా బాలుర కంటే బాలికలే అధికంగా ఉన్నప్పటికీ టాప్ 10 ర్యాంకుల్లో 5వ ర్యాంకు సాధించిన ఢిల్లీ విద్యార్థిని అవికా అగర్వాల్ ఒక్కరే బాలిక ఉండటం గమనార్హం.

## చరిత్ర సృష్టించిన టెంబా బావుమా.. తొలి కెప్టెన్‌గా

» 6లో



మొదటి పేజీ తరువాయి

# చిత్ర పరిశ్రమ గొప్పగా రాణించాలి హాలీవుడ్‌కు వేదికవ్వాలి: సీఎం రేవంత్








సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం

'భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ. తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికైంది. రాష్ట్ర ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది మీ అభివృద్ధి కోసమే. తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి. రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మరో 22 ఏళ్లు నేను క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. నేను ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా. ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం కేటాయిస్తాం. నేను ఇటీవల నీతి అయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి తెలంగాణ విజన్ గురించి వెల్లడించాను. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తాం. ఇప్పటివరకు నేను అనుకున్నవన్నీ సాధించాను. ఇది కూడా సాధ్యమవుతుందని 100 శాతం నమ్మకం ఉంది. తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు నాలుగో తరం కొనసాగుతోంది. గద్దరన్న అంటే ఒక విప్లవం.. ఒక వేగుచుక్క.. ఆయనే మాకు ఒక స్ఫూర్తిం. ఆ స్ఫూర్తితోనే మేం పోరాటాలు చేశాం. తెలంగాణ అభివృద్ధికి మీ అందరి సహకారం ఉండాలని కోరుతున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు

గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గద్దర్ ఫౌండేషన్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఫౌండేషన్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని గతంలో గద్దర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

# నదులు, నిధులు.. రెండూ ఆంధ్రాకేనా?



ఈ కబురు, హైదరాబాద్: గోదావరి నదీ జలాల్లో కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణకు ద్రోహం చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పైసా సాయం చేయలేదని, కానీ ఏపీ అక్రమంగా చేపడుతున్న గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు మూట సాయం, మూట సాయం అందిస్తోందని మండిపడ్డారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ పేరిట ఏపీ చేస్తున్న జల దోపిడి - కాంగ్రెస్ మౌనం'అనే అంశంపై హరీశ్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఇరిటేషన్ తప్ప ఇరిగేషన్ ఎక్కడ?

'రేవంత్ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని ఇరిటేట్ (అసహనానికి గురిచేయటం) చేయడం తప్ప ఇరిగేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. బనకచర్ల లింక్ ద్వారా గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలించుకుపోతున్నా ప్రతిపక్షాలపై కేసులు, విచారణలు, మంత్రివర్గ విస్తరణ అంటూ సీఎం దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడు. నీటిపారుదలపై అఖిలపక్ష సమావేశానికి ముందుకు రాకుండా తాము సన్నద్ధం కాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్తున్నాడు. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేకున్నా కేంద్రం నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏపీకి వత్తాసు పలుకుతోంది. సమైక్య పాలనలో సమైక్య పాలకుల వద్ద బానిసల్లా బతికిన వారు స్వరాష్ట్రంగా ఏర్పడినా తెలంగాణ ఆత్మగౌరవాన్ని పక్క రాష్ట్ర నాయకత్వం వద్ద తాకట్టు పెడుతున్నారు. నదీ జలాలను ఏపీకి కేంద్రం దోచి పెడుతున్నా సీఎం రేవంత్ స్పందించడం లేదు'అని హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నదీ జలాల్లో అన్యాయంపై మాట్లాడటం లేదని ఆరోపించారు. చంద్రబాబుతో బీజేపీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ ప్రాజెక్టులను కేంద్ర మంత్రులు అడ్డుకోవడం పాటు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. వెంటనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఏపీ జలదోపిడీని అడ్డుకునేలా ఏకగ్రీవ తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని సూచించారు. కాళేశ్వరంపై త్వరలో ప్రజల వద్దకు త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లను సందర్శించి ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంత రైతులతో కలిసి బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీం కోర్టుకు వెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపైనా త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని పేర్కొన్నారు. సొంత అవసరాల కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడితే రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి

# అమెరికాలో రాజకీయ హత్యలు



**ఈ కబురు,చాంప్లిన్: అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఇద్దరు చట్టసభ సభ్యులు, వారి జీవిత భాగస్వాములపై కాల్పులు జరిగాయి. శనివారం తెల్లవారుజామున బ్రూక్లిన్ పార్కులో జరిగిన కాల్పుల్లో మిన్నెసోటా చట్టసభ సభ్యురాలు, మాజీ స్పీకర్ మెలిసా హార్ట్‌మన్, ఆమె భర్త మరణించారని అధికార వర్గాలు తెలిపాయి. మరో దాడిలో సెనేటర్ జాన్ హాఫ్‌మన్, అతని భార్య గాయపడ్డారు. రాజకీయ ఉద్దేశాలతో జరిగిన దాడులుగా వీటిని అధికారులు భావిస్తున్నారు. దుండగుడు ఓ పోలీసు అధికారి వేషంలో వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. "రాష్ట్రంలోనే కాదు యావద్దేశంలో మనందరం అన్ని రకాల రాజకీయ హింసకు వ్యతిరేకంగా నిలవాలి" అని మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ తెలిపారు.**

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్‌తో

## వాయుసేన శక్తి చూపాం



ఈ కబురు, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ భారత వైమానిక దళ సత్తాకు నిదర్శనంగా నిలుస్తుందని చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (సీఏఎస్) ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. శత్రువును కచ్చితత్వంతో దెబ్బ కొట్ట గలమని నిరూపించామని, భారత వాయుసేన సామర్థ్యాన్ని ఈ ఆపరే షన్‌లో ప్రదర్శించామని ఆయన పేర్కొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన 254 మంది ఫ్లైయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల ఫ్లైట్ కేడెట్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసు కున్న సందర్భంగా దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ)లో శనివారం ఘనంగా కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న కేడెట్లకు రాష్ట్రపతి కమిషన్‌ను(అధికారిక బ్యాడ్జీలను) ప్రదానం చేశారు. వీరితోపాటు భారత నౌకాదళం నుంచి తొమ్మిది మంది అధికారులు, కోస్ట్‌గార్డ్స్ నుంచి ఏడుగురు, వియత్నాం నుంచి ఒకరు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన కేడెట్లకు పతకాలు అందజేశారు. అనంతరం ఏపీ సింగ్ కేడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, యువ అధికారులు దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి ఏదైనా ముప్పు సంభవించినప్పుడు దానిని ఎదుర్కోవడానికి మొదటి వరుసలో భారత వాయుసేన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, తాను భారత వాయుసేనలో చేరి శుక్రవారంతో 40 ఏళ్లు పూర్తయినట్టు ఏపీ సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. యువ అధికా రులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చిన ఎయిర్ ఫోర్స్ అకాడమీ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వాయుసేన అధికారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రైనింగ్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ తేజిందర్ సింగ్, ఎయిర్ ఫోర్స్ అకాడమీ కమాండెంట్ ఎయిర్ మార్షల్ పీకే వోహ్రా ఇతర ఎయిర్‌ఫోర్స్ అధికారులు, కేడెట్ల కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# విమాన ప్రమాదంపై

## ఉన్నతస్థాయి విచారణ



ఈ కబురు, దిల్లీ: అహ్మదాబాద్‌లండన్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి, వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని విస్తృత విచారణ చేపట్టడానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఈ ఘటనపై ఇప్పటికే దర్యాప్తు జరుపుతున్న 'విమాన ప్రమాద దర్యాప్తు మండలి'కి అతీతంగా ఈ కమిటీ స్వతంత్ర విచారణ జరుపుతుందని చెప్పారు. విమాన ప్రమాదంపై సమీక్ష అనంతరం ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. 'దుర్ఘటనపై విస్తృతకోణాల్లో కమిటీ సంపూర్ణంగా దర్యాప్తు చేస్తుంది. అన్ని భాగస్వామ్యపక్షాలు, నిపుణులతో చర్చించి నివేదిక సమర్పిస్తుంది. దీనికి మూడునెలల గడువు విధించాం. బోయింగ్ 787 విమానాలపై ఇంకా ప్రత్యేక నిఘా ఏమైనా ఉంచాలా? అని ఆలోచిస్తున్నాం. ప్రస్తుతం మనవద్ద ఉన్న ఇలాంటి 34 విమానాలను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని డీజీసీఏని ఆదేశించాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం' అని మంత్రి ప్రకటించారు. బాధిత కుటుంబాల ఆవేదన అర్థం చేసుకోగలను "మా నాన్నను రోడ్డు ప్రమాదంలో కోల్పోయాను. బాధిత కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకోగలను. బ్లాక్‌బాక్స్ డీకోడింగ్‌తో ప్రమాద కారణాలు తెలుస్తాయని దర్యాప్తు బృందం భావిస్తోంది. వివిధ కోణాల్లోంచి వినిపిస్తున్న విభిన్న అంశాలను లోతుగా పరీక్షించడానికి మరో కమిటీ ఉంటే బాగుంటుందని భావించాం. అందుకే అహ్మదాబాద్ ప్రమాదంతోపాటు, భవిష్యత్తులో విమానయాన రంగంలో అనుసరించాల్సిన భద్రతాచర్యలపై అధ్యయనం చేయడానికి మరో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం" అని రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ప్రమాద కారణాలపై మీడియా ప్రశ్నలకు తగిన సమయంలో సమాధానం ఇస్తామన్నారు. పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ ప్రమాదానికి గురైన విమానం పారిస్ నుంచి దిల్లీకి, అక్కడినుంచి అహ్మదాబాద్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చిందని గుర్తుచేశారు. విమానం కూలడానికి కారణాలను నిర్ధారించి, భవిష్యత్తులో ఇలాంటివి చోటుచేసుకోకుండా పాటించాల్సిన ప్రామాణిక నిర్వహణ పద్ధతులను కమిటీ సిఫార్సు చేస్తుందని చెప్పారు.

# తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్

మొదటి పేజీ తరువాయి

**ఈ కబురు:సంస్థాన్ నారాయణపురం: మారుమూల తండాలో పుట్టి పెరిగిన గిరిజన బిడ్డ సరిత.. ప్రగతి రథం స్టీరింగ్ పట్టి చరిత్ర సృష్టించింది. శనివారం ఆమె ఎంజీబీఎస్ నుంచి మిర్యాలగూడ వరకు నాన్‌స్టాప్ బస్సు నడిపింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యాతండాకు చెందిన వి.రాంకోటి, రుక్కల కుమార్తె సరిత అక్క దగ్గర ఉంటూ దేవరకొండలో 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి, అక్కడ నుంచి 10వ తరగతి వరకు ఓపెన్ స్కూల్‌లో చదివింది. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో కుటుంబ బాధ్యతను తీసుకుంది.ఈ క్రమంలో ఆటో నడపడం నేర్చుకుంది. ఐదేళ్లు సంస్థాన్ నారాయణపురం నుంచి సీత్యాతండా వరకు ఆటో నడిపింది. అనంతరం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ బస్సు డ్రైవింగ్ నేర్చుకుంది. తర్వాత కాలంలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకుంది. ఆజాద్ ఫౌండేషన్ సహకారంతో సరిత ఢిల్లీకి వెళ్లి కొన్నాళ్లు కారు నడిపింది. రెండేళ్ల తర్వాత ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో 15 మంది మహిళా డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయగా, సరిత ఒక్కతే ఎంపికైంది. దీంతో దేశంలో మొదటి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు పొందింది. ఆమె ఢిల్లీలోని సరోజినీ డిపోలో ఉద్యోగం చేస్తూ రోజూ 185 కిలోమీటర్ల దూరం బస్సు నడిపింది.**



# పీఎఫ్ఆర్‌ను కేంద్రం ఆమోదించిందా?



ఈ కబురు, హైదరాబాద్: 'గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)ను కేంద్రం ఆమోదించిందా? ఈ ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న తరుణంలో సీడబ్ల్యూసీలో చర్చించడం ఆక్షేపణీయం'.. అంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి లేఖ ద్వారా అభ్యంతరం తెలిపారు. ఏపీ పంపిన పీఎఫ్ఆర్‌కు ఆమోదం తెలపకుండానే ఆ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) పంపాలని ఎలా అడిగారంటూ నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. ''ఈ నెల 2న కేంద్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ నేతృత్వంలో ఏపీ అధికారులు సమావేశమైనట్లు సమాచారం. కేంద్ర జలశక్తిశాఖ సీనియర్ సంయుక్త కమిషనర్ అమిత్ కుమార్ ఝా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ అధికారులు పీఎఫ్ఆర్‌పై ఆరా తీయగా.. దాన్ని సీడబ్ల్యూసీ పరిశీలిస్తోందని, జూన్ నెలాఖరు నాటికి డీపీఆర్ అందజేయాలంటూ సజ్జన్ సూచించారు. ఇది ఎంతవరకు సరైనదో కేంద్రం పరిశీలన చేసుకోవాలి. దీన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆ ప్రాజెక్టు పీఎఫ్ఆర్‌ను తిరస్కరించేలా సీడబ్ల్యూసీకి ఆదేశాలు ఇవ్వండి'' అంటూ ఉత్తమ్ డిమాండ్ చేశారు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డు, రాష్ట్ర విభజన చట్టాన్ని ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. ''ఈ ఏడాది జనవరిలోనే ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వ వ్యతిరేకతను లేఖ ద్వారా కేంద్రానికి తెలియజేశాం. పలుమార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకొచ్చాం. గోదావరి బనకచర్ల లింక్‌కు నీటి వాటాల కేటాయింపు లేదు. సీడబ్ల్యూసీ అనుమతి లేని ప్రాజెక్టుల పీఎఫ్ఆర్‌లను.. డీపీఆర్‌ను కోరే వరకు వెళ్లకుండానే తిరస్కరిస్తుంది. ఒకవేళ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపితే, అంతర్రాష్ట్ర నదీ జలాల విషయంలో రాష్ట్రాల న్యాయమైన హక్కులను కాపాడటంలో కేంద్రం విఫలమైనట్లే అని భావించాల్సి వస్తుంది. నేను జనవరిలో రాసిన లేఖకు సమాధానంగా మీరు మాకు మే 28న ఒక లేఖ రాశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనేదీ అందలేదని, అందితే ట్రైబ్యునల్ అవార్డులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, రాష్ట్ర విభజన చట్టం నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తామంటూ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్రం నుంచి వెలువడుతున్న సంకేతాలు తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయి. దీనిపై ఏపీ తదుపరి చర్యలు తీసుకోకుండా, టెండర్లకు వెళ్లకుండా నిలువరించాలి. వరద నీటిని మళ్లిస్తున్నామని ఏపీ చేస్తున్న వాదనలు అసంబద్ధమైనవి. ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం వరద జలాలు అనేవే లేవు'' అని ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు.

**భారాస ప్రభుత్వ నిర్ణయాలతోనే సంక్షోభం**

రాష్ట్ర ప్రభుత్వంపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమంటూ మంత్రి ఉత్తమ్ తోసిపుచ్చారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి మొదటి నుంచీ తమ ప్రభుత్వం పోరాటం చేస్తూనే ఉందన్నారు. 'నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాలరాసింది నాటి భారాస ప్రభుత్వమే. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా రావాల్సి ఉండగా ఏకపక్షంగా 299 టీఎంసీలకు అంగీకారం చేసుకుని ద్రోహం చేశారు. నాటి నిర్ణయమే సంక్షోభానికి బాటలు వేసింది. కేసీఆర్, జగన్‌ల మధ్య జరిగిన నిశ్శబ్ద ఒప్పందంతోనే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. ఆ సమయంలో ఎపెక్స్ కౌన్సిల్‌ను సంప్రదించకుండా తెలంగాణ దూరంగా ఉంది. నీటిని దోచుకోవడానికి ఏపీకి భారాస అనుమతించింది' అని విమర్శించారు.

# 10 గంటల నిద్ర అనారోగ్యమే!



**ఈ కబురు: ప్రతి దేశంలోనూ సంస్కృతికి అనుగుణం కాని నిద్ర గంటల వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని కూడా క్రిస్టీన్ బృందం తమ అధ్యయనంలో కనుగొంది. అంటే చాలా తక్కువ నిద్రపోవడం లేదా చాలా ఎక్కువ నిద్రపోవడం అని కాకుండా, వారి సంస్కృతిని అనుసరించి నిద్ర పోవటం అన్నదే వారిని ఆరోగ్యంగా ఉంచుతోంది. బ్రిటన్ పౌరులు కొందరు 10 గంటల 26 నిమిషాల కంటే ఎక్కువ నిద్రపోయిన కారణంగా.. అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నారని క్రిస్టీన్ బృందం పేర్కొంది.**

అమెరికాలో 8 గంటల 13 నిమిషాలు నిద్రపోయే వారిలో కూడా ఈ సమస్య కనిపించింది. క్రిస్టీన్ బృందం తమ అధ్యయనంలో పోషకాహారం, సంపద, అసమానత, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలను చేర్చలేదు. కాబట్టి నిద్ర గంటలకు, ఆరోగ్యంపై నిద్ర చూపే ప్రత్యక్ష ప్రభావంపై తీర్మానాలేవీ చేయలేకపోయారు. 'ఎవరైనా ఎన్ని గంటలు నిద్రపోవాలన్న ప్రశ్నకు సమాధానం నిజంగా చాలా సంక్లిష్టమైనది.

మనిషికి రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం అనేందుకు ఎటువంటి ఆధారాలూ లేవు. మీ నిద్ర, ఆరోగ్యం విషయంలో మీ సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాలి' అని కీలే విశ్వవిద్యాలయంలోని స్లీప్ సైకాలజిస్ట్ డాక్టర్ దల్జిందర్ చామర్స్ సూచించారు.

## దేశానికొక 'తగినంత నిద్ర'

నిద్ర కేవలం దేహధర్మం మాత్రమే కాదని, ఆ దేశ అలవాట్లు, సంస్కృతి, పని వేళలు, అక్కడి వాతావరణం, సూర్యరశ్మి తగిలేలా ఉండటం, సామాజిక నిబంధనల వంటి అనేక కారకాలు నిద్ర పోయే సమయాన్ని ప్రభావితం చేస్తాయని 'విక్టోరియా స్కూల్ ఆఫ్ నర్సింగ్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉన్న డాక్టర్ క్రిస్టీన్ చెబుతున్నారు. "ఒక దేశంలో 'తగినంత' నిద్రగా పరిగణన పొందేది, మరొక దేశంలో అతి నిద్ర కావచ్చు, లేదా చాలినంత నిద్ర కాకనూ పోవచ్చు" అని ఈ అధ్యయనంలో పాల్గొన్న క్రిస్టీన్ అంటున్నారు.

**ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఐరోపా, ఆసియా, ఆఫ్రికా తదితర 20 దేశాలలో ఈ అధ్యయనం కోసం ఆన్లైన్ ప్రశ్నపత్రాన్ని పూర్తి చేసిన దాదాపు 5,000 మంది వ్యక్తుల నిద్ర అలవాట్లు, ఆరోగ్య డేటాను విశ్లేషించి క్రిస్టీన్ బృందం ఈ ముగింపునకు వచ్చింది. నిద్రా సమయంపై గతంలోనూ అనేక సుప్రసిద్ధ సంస్థలు ఎన్నో అధ్యయనాలు చేశాయి.**

అలా జరిగిన 14 అధ్యయనాల నుండి అదనపు సమాచారాన్ని కూడా ప్రస్తుతం బృందం సేకరించింది. అంతేకాకుండా ఆయుర్దాయం, గుండె జబ్బులు, ఊబకాయం, మధుమేహం వంటి వాటికీ, నిద్రపోయే గంటలకు మధ్య ఉన్న సంబంధాన్ని లెక్కలోకి తీసుకుని పరిశోధకులు ఈ ఫలితాలను వెల్లడించారు.

## ఫ్రాన్స్‌లో ఎక్కువ... జపాన్‌లో తక్కువ

తాజా అధ్యయనం ప్రకారం.. భారతీయులు సగటున 7 గంటల 15 నిమిషాలు నిద్రపోతున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు కూడా మన నిద్రా సమయంతో సమానంగా ఉండటం విశేషం. ఫ్రాన్స్ జాతీయులు తక్కిన దేశస్థుల కన్నా ఎక్కువ సమయం నిద్రిస్తున్నారు. ప్రశ్నపత్రం పూరించిన ముందు రోజు రాత్రి సగటున వారు 7.52 గంటలు నిద్రించారు. ఇక అందరికన్నా తక్కువగా నిద్రపోయిన వారు జపనీయులు. వారు 6.18 గంటలు మాత్రమే నిద్రపోయారు. బ్రిటన్ వాళ్లు 7 గంటల 33 నిమిషాలు నిద్రపోతే, అమెరికాలో నిద్రా సమయం 7 గంటల 2 నిమిషాలే.

క్రిస్టీన్ బృందం మరికొన్ని ఆశ్చర్యకరమైన విషయాలను కూడా కనుగొంది. ఆరోగ్యకారకమైన 'ఆదర్శ' నిద్రా సమయం అంటూ ఏ దేశంలోనూ లేదు! తక్కువ సగటు నిద్ర వ్యవధి ఉన్న దేశాల వారిని ఎక్కువసేపు నిద్రపోయే దేశాలలోని వ్యక్తులతో పోల్చి చూసినప్పుడు వాళ్ల ఆరోగ్యం అధ్వానంగా ఉందని చెప్పటానికి ఈ బృందానికేమీ ఆధారాలు కనిపించలేదు. దేశ సంస్కృతికి అనుగుణమైన నిద్ర గంటలు.. ఆదర్శ నిద్ర గంటల కంటే ఆరోగ్యంగా ఉంచుతున్నాయని అధ్యయనం పేర్కొంది.

# ఇరాన్‌కు రెండో అవకాశం ఇస్తున్నాం



*ఈ కబురు,వాషింగ్టన్: ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నియంత్రించుకునే అంశంపై త్వరగా ఒక ఒప్పందానికి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న నేపథ్యంలో మరింత విధ్వంసం నుంచి తప్పించుకోవడానికి ఇరాన్ నాయకత్వానికి ఇది 'రెండో అవకాశం' అని ఆయన పేర్కొన్నారు. ఈసారైనా దారికి రావాలని హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో ఇక ఏమీ మిగలదన్నారు. ఒకప్పుడు ఇరానియన్ సామ్రాజ్యంగా పేరొందిన దేశాన్ని కాపాడుకునేందుకు అక్కడి పాలకులు ముందుకు రావాలని కోరారు. శనివారం ఆయన అమెరికా జాతీయ భద్రతా బృందంతో సమావేశమయ్యారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఉత్పన్నమైన పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అణు కార్యక్రమంపై ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలన్న తన సూచనను తెలియజేసేందుకు ఆయన అమెరికా టీవీ ఛానళ్లకు చెందిన పలువురు న్యూస్ యాంకర్లకు వరుసగా ఫోన్లు చేశారు.ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తమ పాత్ర లేదని అమెరికా వైట్‌హౌస్ ప్రకటించింది. అయితే తాజాగా ట్రంప్ ఇందుకు భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. "పెద్దఎత్తున అమెరికా సమకూర్చిన ఆయుధాలతోనే ఇరాన్‌లోని నతాంజ్ ప్రధాన యురేనియం శుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇతర లక్ష్యాలపైనా మా ఆయుధాలనే ఇజ్రాయెల్ విరుచుకుపడింది" అని ఆయన చెప్పడం గమనార్హం. మరోవైపు పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై ట్రంప్.. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో చర్చలు జరిపారు.*

*తాజా పరిస్థితుల్లో అగ్రరాజ్యంతో చర్చలు అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టంచేశారు. తమపై దాడికి అగ్రరాజ్యం ఇజ్రాయెల్‌కు మద్దతు పలికిందని విమర్శించారు. "ఒకవైపు మాపై దాడులకు మద్దతునిస్తూ.. మరోవైపు అణు ఒప్పందంపై చర్చలకు ఆహ్వానించడం సరికాదు. అమెరికా అనుమతి లేకుండా ఇజ్రాయెల్ మాపై దాడి చేసే అవకాశమే ఉండదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘై పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా మధ్య అణు ఒప్పందం కోసం ఒమన్ మధ్యవర్తిత్వంలో ఏప్రిల్ నుంచి చర్చలు జరుగుతున్నాయి. ఆదివారం ఒమన్ వేదికగా ఆరోవిడత చర్చలు జరగాల్సి ఉంది. "అణు ఒప్పందంపై అమెరికాతో జరగాల్సిన చర్చలపై మేం ఏం నిర్ణయిస్తామనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు" అని బఘై పేర్కొన్నట్లుగా ఇరాన్‌కు చెందిన ఓ మీడియా సంస్థ వార్తను ప్రచురించింది. అయితే ఆదివారం చర్చలు జరగడంలేదని ఒమన్ పేర్కొంది.*

# నీట్ యూజీ తెలంగాణ టాపర్ కాకర్ల జీవన్‌సాయి

ఈ కబురు, హైదరాబాద్/అమరావతి: దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ ప్రవేశ, అర్హత పరీక్ష (నీట్-యూజీ)లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా కాకర్ల జీవన్ సాయికుమార్ మెరిశాడు. అతడికి జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నేషనల్ 19వ ర్యాంకు సాధించిన కార్తీక్ రామ్ కిరీటి నిలిచాడు. నీట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. టాప్ వంద లోపు తెలంగాణ నుంచి 5 మంది, ఏపీ నుంచి ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిలో మొత్తంగా బాలుర కంటే బాలికలే అధికంగా ఉన్నప్పటికీ టాప్ 10 ర్యాంకుల్లో 5వ ర్యాంకు సాధించిన ఢిల్లీ విద్యార్థిని అవికా అగర్వాల్ ఒక్కరే బాలిక ఉండటం గమనార్హం. ఎంబీబీఎస్‌తో పాటు బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ యూజీ-2025 పరీక్షను ఎన్‌టీఏ మే 4న నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 22.76 లక్షల మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 22,09,318 మంది పరీక్ష రాశారు. వారిలో 12,36,531 మంది అర్హత సాధించారు. టాప్ 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులంతా జనరల్ కేటగిరీవారే. వచ్చే నెలలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు

**సత్తా చాటిన తెలంగాణ విద్యార్థులు**

తెలంగాణ రాష్ట్రం నుంచి 72,094 మంది నీట్ యూజీ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 70,259 మంది పరీక్ష రాశారు. వీరిలో 41,584 మంది అర్హత సాధించారు. అంటే 59.2 శాతం మంది అర్హత సాధించారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే తక్కువే. నీట్-యూజీ 2024లో 77,848 మంది పరీక్ష రాయగా, 47,356 మంది అర్హత సాధించారు. జాతీయ స్థాయిలో కూడా 2024 కన్నా 2025లో పరీక్ష రాసిన వారు, అర్హత సాధించినవారు తక్కువగానే ఉండడం గమనార్హం. తెలంగాణ నుంచి నేషనల్ టాప్ 100 ర్యాంకుల్లో కాకర్ల జీవన్ సాయికుమార్ (18), షణ్ముఖ నిశాంత్ అక్షింతల (37), మంగరి వరుణ్ (46), యంద్రపాటి షణ్ముఖ్ (48), బిదిష మజీ (95) ఉన్నారు. కాగా, జాతీయ స్థాయిలో టాప్ 20 మహిళా టాపర్లలో తెలంగాణ నుంచి బిదిష మజీ తోపాటు 108వ ర్యాంకు సాధించిన బ్రాహ్మణి రెండ్లకు స్థానం లభించింది. ఓబీసీ-నాన్ క్రీమీలేయర్ (ఎన్‌సీఎల్) కేటగిరీలోని టాప్ 10లో 46వ ర్యాంకు సాధించిన మంగరి వరుణ్‌కు చోటు దక్కింది. టాప్-10 ఎస్సీ కేటగిరీలో 147 ర్యాంకు సాధించిన రెడ్డిమల్ల శ్రీశాంత్ ఉన్నాడు. టాప్ 10 ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 377 ర్యాంకు సాధించిన పుజారి హాసిని, 1,178 ర్యాంకు సాధించిన బానోత్ ధీరజ్ కుమార్ ఉన్నారు.

**ఏపీ నుంచి 36,776 మంది అర్హత**

నీట్ యూజీ-2025లో ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది అర్హత సాధించారు. టాప్-100లో ఆరు ర్యాంకులు సొంతం చేసుకున్నారు. ఏపీ నుంచి ఈసారి 59,219 మంది దరఖాస్తు చేసుకోగా, 57,934 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 36,776 మంది అర్హత సాధించారు. 19వ ర్యాంకుతో దర్భా కార్తీక్ రామ్ కిరీటి రాష్ట్ర టాపర్‌గా నిలిచాడు. కొడవాటి మోహిత్ శ్రీరామ్ (56), దేశిన సూర్యచరణ్ (59), పొదిలపు అవినాష్ (64 ఓబీసీ), యర్రా సమీర్ కుమార్ (70 ఓబీసీ), తుమ్మూరి శివ మణిదీప్ (92 ఓబీసీ) 100 లోపు ర్యాంకులు సాధించారు.

వీరుగాక కారుమంచి విక్రాంత్ జాతీయ స్థాయిలో 262 ర్యాంకుతో పాటు ఎస్సీ కేటగిరీలో 9వ స్థానంలో నిలిచాడు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కలిపి మొత్తం 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో దాదాపు 56 వేలు, ప్రైవేటు కాలేజీల్లో 52 వేల వరకు సీట్లు ఉన్నాయి. ఏపీలో 18 ప్రభుత్వ, 18 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 6,500 వరకు ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 15 శాతం సీట్లు ఆలిండియా కోటాకు పోగా, మిగిలిన 85 శాతం సీట్లను రాష్ట్ర కోటా కింద భర్తీ చేస్తారు.

**686 మార్కులకు మొదటి ర్యాంకు**

నీట్ యూజీ-2025 పరీక్ష మొత్తం 720 మార్కులకు నిర్వహించగా, 651 నుంచి 686 మధ్య మార్కులు వచ్చిన వారు 73 మంది ఉన్నారు. అంటే జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిన రాజస్తాన్‌కు చెందిన మహేశ్ కుమార్‌కు 686 మార్కులు వచ్చే అవకాశం ఉంది. మొత్తం అర్హత సాధించినవారిలో 7.2 లక్షల మంది బాలికలు ఉండగా, 5.14 లక్షల మంది బాలురు ఉన్నారు.

**కార్డియాలజిస్ట్ లేదా స్కల్ సర్జన్ అవుతా**

తొమ్మిదో తరగతి నుంచే న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదవాలనుకునే వాడిని. అదిప్పుడు నెరవేరుతోంది. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం పీజీ కార్డియాలజీ లేదా స్కల్ సర్జన్ రెండింటిలో ఒకటి చేసి వైద్య సేవలందించడమే నా లక్ష్యం. మా నాన్న డాక్టర్ డీఎస్ అరుణ్‌కుమార్ ఈఎన్‌టీ సర్జన్. అమ్మ లత గృహిణి. - డి. కార్తీక్‌రామ్ కిరీటి, ఆలిండియా ఓపెన్ కేటగిరీ 19వ ర్యాంకు, రాజమహేంద్రవరం



# రాజకీయ నిఘా కోసమే ఎస్‌వోటీ

**ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తుండటంతో కేసులో చిక్కుముడులు వీడుతున్నాయి.**

**సిట్ తాజా విచారణలో ప్రభాకర్‌రావు అంగీకారం!**

**ప్రణీత్‌రావుకు ప్రత్యేక బాధ్యత అప్పగించానని వెల్లడి**

**అనుమతులకు 'మావోయిస్టు' ముసుగు**

**ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక మలుపు**

ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తుండటంతో కేసులో చిక్కుముడులు వీడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు రాజకీయ నిఘా కోసమే ఎస్ఐబీలో ప్రత్యేక విభాగాన్ని(ఎస్‌వోటీ) ఏర్పాటు చేశానని ప్రభాకర్‌రావు అంగీకరించినట్లు తెలిసింది. ఈ పని చేసేందుకే ప్రణీత్‌రావును ఎస్ఐబీకి తీసుకొచ్చానని చెప్పినట్లు సమాచారం. ప్రధానంగా భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వారికి సంబంధించిన ఫోన్లలో సంభాషణలను అక్రమంగా వినే ఉద్దేశంతోనే ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్ (ఎస్‌వోటీ) విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు సిట్‌కు వివరించినట్లు తెలిసింది.

కేవలం రాజకీయ నిఘా కోసమే ఈ విభాగం పనిచేసిందని తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇదంతా ఎవరి ప్రోద్బలంతో చేయాల్సి వచ్చిందనే కోణంలో సిట్ తాజాగా దర్యాప్తు చేస్తోంది. తగిన ఆధారాలు లభిస్తే రాజకీయంగా సంచలనాలు వెలుగు చూసే అవకాశం కనిపిస్తోంది. ప్రభాకర్‌రావును ఇప్పటికే రెండు విడతలుగా విచారించిన సిట్.. శనివారం మూడో విడత సుదీర్ఘంగా మాట్లాడి వివరాలు రాబట్టింది.

**డబ్బులు.. ఔషధాలు.. ఆయుధాలు..**

ముఖ్యంగా 2023 శాసనసభ ఎన్నికలకు ముందు భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారితో సహా ఇతర ప్రముఖుల ఫోన్లపై ఎస్‌వోటీ నిఘా ఉంచేందుకు అనుమతులెలా వచ్చాయని సిట్ ఆరా తీయడంతో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిఘా ఉంచాల్సిన ఫోన్ నంబర్ల జాబితాలు.. డిజిగ్నేటెడ్ అథారిటీ హోదాలో ప్రభాకర్‌రావు పేరుతోనే ఉన్నతాధికారులకు వెళ్లేవి. ఆ ఫోన్ నంబర్లపై ఎందుకు నిఘా ఉంచాలని తెలిపే సమయంలో 'మావోయిస్టు' ముసుగు వాడారు. మావోయిస్టులకు డబ్బులు, ఔషధాలు, ఆయుధాలు సరఫరా చేస్తున్నారంటూ ప్రముఖులందరికీ ముద్ర వేశారు. ఉన్నతాధికారులూ ఆ ఫోన్ల జాబితాలకు ఆమోదం తెలిపారు. అనంతరం ప్రభాకర్‌రావు బృందం ఆ జాబితాలనే సర్వీస్ ప్రొవైడర్లకు పంపింది. అలా విన్న ఫోన్ల కాల్ రికార్డులను నిక్షిప్తం చేసిన హార్డ్‌డిస్క్‌లనే ఎన్నికల ఫలితాల తర్వాత ధ్వంసం చేసింది.ప్రణీత్‌రావు పొరపాటు..

**ప్రభాకర్‌రావుకు గ్రహపాటు**

ప్రణీత్‌రావు చేసిన పొరపాటు ప్రభాకర్‌రావుకు గ్రహపాటుగా మారినట్లు కనిపిస్తోంది. 2023 డిసెంబరులో ప్రభాకర్‌రావు బృందం తమ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలోని డేటాను పకడ్బందీగా డిలీట్ చేసింది. మరోవైపు ఈ బృందం ధ్వంసం చేసి మూసీలో పడేసిన హార్డ్‌డిస్క్‌లను వెలికితీసి ఎఫ్ఎస్ఎల్ ద్వారా విశ్లేషించినా విలువైన సమాచారమేదీ లభ్యం కానట్లు తెలిసింది. అయితే ప్రణీత్‌రావు 2023 జూన్ వరకు తాను వినియోగించిన ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడం మరిచిపోయారు. ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణ క్రమంలో ఆ ఫోన్‌లో సేవ్ చేసిన రాజకీయ నేతల సంభాషణలు తాజాగా సిట్ చేతికి అందాయి. భాజపాలో ఉన్న ఒక మాజీ ఎంపీ, అలాగే సిద్దిపేటకు చెందిన ఒకరి సంభాషణలు ఆ ఫోన్‌లో బహిర్గతమయ్యాయి. దీంతో రాజకీయ నిఘా జరిగిందనేందుకు కీలక ఆధారాలు లభ్యమైనట్లయింది. ప్రస్తుతం వీటి గురించి ప్రభాకర్‌రావు సమాధానం చెప్పాల్సి ఉంది.

**నేటి నుంచి బాధితుల వాంగ్మూలాల నమోదు**

సిట్ అధికారులు శనివారం ప్రభాకర్‌రావును సుమారు 9 గంటలపాటు విచారించారు. ఈనెల 17న మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. ఆయన సెల్‌ఫోన్లను జప్తు చేయాలని సిట్ నిర్ణయించింది. మరోవైపు ఆదివారం నుంచి బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయనుంది.






## ఎస్‌బీఐలో హోమ్‌లోన్లు.. గుడ్‌న్యూస్

దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన రుణ రేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో ఎస్‌బీఐ కూడా రుణ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ రేట్ల కోత జూన్ 15 నుంచి అమలులోకి వస్తుందని, ప్రస్తుత రెపో లింక్డ్ రుణాలు, కొత్త రుణగ్రహీతలకు వర్తిస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది.

వారం రోజుల క్రితం ఆర్బీఐ రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ పాలసీ రెపో రేటులో సగం శాతం తగ్గింపునకు అనుగుణంగా ఎస్‌బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్), గృహ రుణ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు తెలిపింది. ఈ తగ్గింపు తర్వాత ఈబీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గింది.

రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ రుణదాత బ్యాంక్ ఆఫ్ బరోడా, మూడవ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యుకో బ్యాంక్ వంటివి ఇప్పటికే రుణ రేట్లను తగ్గించాయి. ఎందుకంటే రెపో రేటుతో లింక్ అయిన లేదా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ రుణాలుగా పిలిచే, ఫ్లోటింగ్ రేట్లలో ఉన్న రుణాలకు రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు తగ్గించిన వెంటనే కాకపోయినా, వచ్చే నెల మొదటి రోజు నాటికి రెపో తగ్గింపును ప్రస్తుత రుణగ్రహీతలకు బదిలీ చేయాల్సి ఉంటుంది.

## ఒక్క ఉద్యోగం..
## 14 రౌండ్ల ఇంటర్వ్యూ!


బెంగళూరులోని ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో డెవలపర్ ఉద్యోగం కోసం 14 రౌండ్ల ఇంటర్వ్యూ క్లియర్ చేశానని ఓ మహిళ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. విప్రో క్యాంపస్‌లో ఉన్న ఫొటోలతో పాటు కంపెనీ లోగోను చూపిస్తూ అంతరా మండల్ అనే మహిళ ఇన్‌స్టాగ్రామ్ థ్రెడ్‌లో వివరాలు షేర్ చేశారు.

ధ్రువీకరణ కోసం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె తన ఆఫీస్ ఐడీ కార్డు కూడా పోస్ట్ చేశారు. ఉద్యోగం కోసం ఏకంగా 14 రౌండ్ల ఇంటర్వ్యూ పూర్తి చేసి కొలువు దక్కించుకున్నట్లు ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

'14 రౌండ్ల ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి చివరకు విప్రోలో డెవలపర్ పొజిషన్‌కు ఎంపికయ్యాను. మీ నిద్రలో వచ్చేవి కలలు కావు.. మిమ్మల్ని నిద్రపోనివ్వనివే అసలైన కలలు' అని ఆమె రాసుకొచ్చారు.

అయితే సామాజిక మాధ్యమాల్లో ఈ పోస్ట్‌పై భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఉద్యోగం కోసం ఇన్ని రౌండ్లు ఇంటర్వ్యూ చేయడంపై చాలా మంది వినియోగదారులు విమర్శించారు. కొందరు ఇందుకు భిన్నంగా రిప్లై ఇచ్చారు. '14 రౌండ్ల ఇంటర్వ్యూ? అది కూడా డెవలపర్ రోల్ కోసమే.. చాలా ఫన్నీ యార్' అని ఒక యూజర్ స్పందించారు.







## ఆధార్ అప్‌డేట్‌కు కొత్త డెడ్‌లైన్

ఆధార్ కార్డుకు సంబంధించిన వివరాల అప్‌డేట్‌కు గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) మరోసారి పొడిగించింది. ఆధార్‌లో డాక్యుమెంట్లను ఉచితంగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు గడువు జూన్ 14న ముగియాల్సి ఉండగా యూఐడీఏఐ ఈ సదుపాయాన్ని మరో ఏడాది పాటు అంటే 2026 జూన్ 14 వరకు పొడిగించింది. ఈ మేరకు 'ఎక్స్'(ట్విటర్) ద్వారా యూఐడీఏఐ వెల్లడించింది.

ఆధార్‌ను ఎవరు అప్‌డేట్ చేసుకోవాలంటే..

ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపుతో కోట్లాది మంది ఆధార్ కార్డుదారులకు ఉపశమనం కలగనుంది. ఈ ఉచిత సేవ మై ఆధార్ పోర్టల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. పదేళ్ల క్రితం ఆధార్ చేయించుకుని ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోని వారు ఆధార్ అప్‌డేట్ చేయాలని యూఐడీఏఐ కోరింది. వివాహం, బదిలీ లేదా ఇతర కారణాల వల్ల పేరు, చిరునామా లేదా మరేదైనా సమాచారం మారితే అప్‌డేట్ చేసుకునేందుకు ఈ సదుపాయం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో ఈ ఆన్‌లైన్ సర్వీసుకు రూ.50 ఫీజు వసూలు చేసేవారు. డిజిటల్ మార్గాల ద్వారా డాక్యుమెంట్ అప్‌డేట్‌ను ప్రోత్సహించడానికి యూఐడీఏఐ ఈ ఛార్జీని తొలగించింది. అయితే ఫిజికల్ ఆధార్ అప్‌డేట్ సెంటర్లలో చేసే అప్‌డేట్‌కు మాత్రం ఇంకా రుసుం వసూలు చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ చేసుకోండిలా..**

- యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్ ( https://myaadhaar.uidai.gov.in ) సందర్శించండి.
- ఆధార్ నెంబర్, ఓటీపీతో లాగిన్ అవ్వండి.
- సమాచారాన్ని సరిచూసుకుని 'ఐ వెరిఫై...'పై క్లిక్ చేయండి.
- ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ (PoI) ఎంచుకుని 2MB కంటే తక్కువ పరిమాణంలో (JPEG/PNG/PDF) డాక్యుమెంట్ కాపీని అప్‌లోడ్ చేయండి.
- డాక్యుమెంట్ ఆఫ్ అడ్రస్ (PoA) సెలెక్ట్ చేసి డాక్యుమెంట్ కాపీని అప్‌లోడ్ చేయాలి.
- అగ్రీ అండ్ సబ్మిట్‌పై క్లిక్ చేయండి.
- రసీదును డౌన్ లోడ్ చేసుకోండి.




## పిజ్జా కంపెనీలో రూ. 1801 కోట్ల షేర్లు అమ్మేసిన ప్రమోటర్లు

జూబిలెంట్ గ్రూప్ కంపెనీల్లో ప్రమోటర్లు గణనీయంగా వాటాలు విక్రయించారు. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ (జేఎఫ్ఎల్), జూబిలెంట్ ఇన్‌గ్రేవియా, జూబిలెంట్ ఫార్మోవాలో రూ. 1,801 కోట్ల విలువ చేసే వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా అమ్మేశారు.ఎన్ఎస్ఈలోని బ్లాక్ డీల్స్ డేటా ప్రకారం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రమోటర్ అయిన జూబిలెంట్ కన్జూమర్ 1.06 కోట్ల ఈక్విటీ షేర్లను (1.61 శాతం వాటా) విక్రయించింది. అలాగే, జూబిలెంట్ ఇన్‌గ్రేవియా ప్రమోటింగ్ సంస్థలు (జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్, శ్యామ్ సుందర్ భార్తియా ఫ్యామిలీ ట్రస్ట్) 98.65 లక్షల షేర్లు (6.2 శాతం వాటా) విక్రయించాయి.

అలాగే జూబిలెంట్ ఫార్మోవా ప్రమోటర్ సంస్థలు జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్ 32.86 లక్షల షేర్లను (2.06 శాతం వాటా) విక్రయించాయి. ఈ షేర్లను సగటున రూ. 662-1,060.37 రేటుకు అమ్మడంతో మొత్తం అన్ని లావాదేవీల విలువ కలిపి రూ. 1,800.98 కోట్లుగా నమోదైంది.




## ఆర్థిక ఫలితాలు, వార్షిక నివేదికల మధ్య సమయాన్ని తగ్గించండి'

**ఆర్థిక ఫలితాలు, పూర్తి వార్షిక నివేదికల ప్రచురణకు మధ్య కాలవ్యవధిని తగ్గించాల్సిందిగా కంపెనీల ముఖ్య ఆర్థిక అధికారుల (సీఎఫ్ఓల)ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ శుక్రవారం కోరింది.**

**సీఎఫ్ఓలకు సెబీ సూచన**

ముంబయి: ఆర్థిక ఫలితాలు, పూర్తి వార్షిక నివేదికల ప్రచురణకు మధ్య కాలవ్యవధిని తగ్గించాల్సిందిగా కంపెనీల ముఖ్య ఆర్థిక అధికారుల (సీఎఫ్ఓల)ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ శుక్రవారం కోరింది. మదుపర్ల విశ్వాసం పెంచడమే లక్ష్యంగా సెబీ ఈ ఆదేశాలిచ్చింది. ఆడిట్ కమిటీలు, ఆడిటర్లతో సీఎఫ్ఓలు తమ సంబంధాలను మరింత పెంచుకోవాలని, ఫలితంగా ఆర్థిక వివరాల వెల్లడిలో జవాబుదారీతనం పెరుగుతుందని సెబీ పూర్తి స్థాయి సభ్యుడు అనంత్ నారాయణ్ పేర్కొన్నారు. కంపెనీల ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి, ప్రజల్లో విశ్వాసం నెలకొనేలా చూడటంలో సీఎఫ్ఓల పాత్ర చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈటీసీఎఫ్ఓ నెక్స్‌ట్‌జెన్ 2025 కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ్.. మూలధన సమీకరణలో ఇటీవలి ధోరణులు, అవకాశాలు, ఎదురవుతున్న ముప్పులు, స్థిరమైన మూలధన వృద్ధి కోసం నిబంధనలను అనుసరించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. 'ప్రస్తుతం వార్షిక ఫలితాలు, పూర్తి ఆర్థిక సంవత్సర నివేదిక ప్రచురణ మధ్య 70140 రోజుల అంతరం ఉంటోంది. పూర్తి నివేదికలో ఉండే ఖాతాల వివరాలు, ఇంటర్నల్ కంట్రోల్ నివేదిక, ఆడిట్ అంశాలు, కరో (కంపెనీస్ ఆడిటర్స్ రిపోర్ట్ ఆర్డర్) వివరాలు చాలా సమాచారాన్ని అందిస్తాయి. అందువల్ల ఫలితాల వెల్లడికి, నివేదిక ప్రచురణకు మధ్య సమయాన్ని తగ్గిస్తే మదుపర్లకు మరింత పారదర్శకంగా సమాచారం అందుతుంది' అని నారాయణ్ వివరించారు.

ఏడాదిలో అవసరమైన ఆడిట్ ప్రణాళిక రూపొందించేందుకు ఆడిట్ కమిటీలు, ఆడిటర్లతో సీఎఫ్ఓలు కలిసి పనిచేయాలని సూచించారు. సీఎఫ్ఓలు తమకు అవసరమైన అంశాల గురించి చర్చించడం కోసం మాత్రమే కాకుండా, ఆడిట్ కమిటీ సమావేశాల్లో పాల్గొనాలని అన్నారు. తద్వారా వాటాదార్లకు నమ్మకం పెరుగుతుందని, మరింత సమాచారం అందుతుందని తెలిపారు. సీఎఫ్ఓలు ఒకప్పుడు సమాచారాన్ని భద్రపరిచే స్థాయి నుంచి ప్రస్తుతం విలువను పెంచే సృష్టికర్తగా మారారని వెల్లడించారు.


# గద్దర్ అవార్డ్స్ వేడుక.. బన్నీ స్పెషల్ అట్రాక్షన్





తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న గద్దర్ సినిమా అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఈ వేడుకకు వేదికైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. టాలీవుడ్ నుంచి సినీ ప్రముఖులు ఎంతోమంది హాజరయ్యారు. అయితే ప్రత్యేక్ష ఆకర్షణగా అల్లు అర్జున్ నిలిచాడు. బన్నీతో పాటు విజయ్ దేవరకొండ కూడా కనిపించడం విశేషం.
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నిర్మాత దిల్ రాజు.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2014 నుంచి 2024 వరకూ గద్దర్ అవార్డులను అందజేశారు. సదరు పురస్కార గ్రహీతలకు సిల్వర్ మెమొంటో, రూ.5 లక్షల ప్రైజ్ మనీతో పాటు ప్రశంసా పత్రం అందించారు. సినీ తారల రాకతో హైటెక్స్ ప్రాంగణం సందడిగా మారింది. వేల మంది ఈవెంట్‌కు హాజరయ్యారు.
'గామి' సినిమాకుగాను ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా విశ్వనాథ్ రెడ్డి, ఉత్తమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా అద్నితిన్ జిహానీ చౌదరి.. 'కల్కి 2898ఏడీ' సినిమాకు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ నల్ల శ్రీను (రజాకార్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అర్చనా రావు- అజయ్ కుమార్ (కల్కి), ఉత్తమ ఆడియోగ్రాఫర్ అరవింద్ మేనన్ (గామి), ఉత్తమ ఎడిటర్ నవీన్ నూలి (లక్కీ భాస్కర్), ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), ఉత్తమ గేయ రచయిత చంద్రబోస్, ఉత్తమ స్టోరీ రైటర్ శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి) అవార్డులు అందుకున్నారు.

# ఆకట్టుకుంటున్న 'కన్నప్ప' ట్రైలర్.. మీరు చూశారా?



మంచు విష్ణు హీరోగా నటిస్తూ, భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా 'కన్నప్ప'. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి స్టార్ హీరోలు ఇందులో అతిథి పాత్రలు చేశారు. మోహన్ బాబు, కాజల్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. జూన్ 27న థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్ర ఈవెంట్ తాజాగా కొచ్చిలో నిర్వహించారు. అక్కడే మోహన్ లాల్ చేతుల మీదుగా ఇప్పుడు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు.
ట్రైలర్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకున్నాయి. ప్రభాస్ స్క్రీన్ పెజెన్స్ కూడా అభిమానులకు నచ్చేలా ఉంది. గతంలో వచ్చిన కంటెంట్‌పై వచ్చింది. ట్రైలర్‌ని మాత్రం ట్రోలింగ్‌కి స్కోప్ లేకుండా బాగానే కట్ చేశారు. అలానే స్టోరీ ఏంటనేది కూడా చూచాయిగా చెప్పేశారు కూడా. సినిమా ఎలా ఉండబోతుందనేది కూడా ట్రైలర్‌తో శాంపిల్ చూపించేశారు.
ఓ గూడెంలో నివసించే తిన్నడు (మంచు విష్ణు).. చిన్నప్పటి నుంచి దేవుడిని పెద్దగా నమ్మడు. పెద్దయిన తర్వాత కొన్ని సంఘటనల వల్ల గూడెం నుంచి ఇతడిని వెలివేస్తారు. అదే టైంలో నెమలి (ప్రీతి ముకుందన్)తో ప్రేమలో పడతాడు. తర్వాత శివుడు(అక్షయ్ కుమార్), రుద్ర(ప్రభాస్)ని భూమ్మీదకు పంపిస్తాడు. రుద్ర వల్ల తిన్నడు.. అతిపెద్ద శివభక్తుడు ఎలా అయ్యాడు? ఈ మొత్తం కథలో వాయు లింగం సంగతేంటి అనేదే స్టోరీలా అనిపిస్తుంది.

# 'టూరిస్ట్ ఫ్యామిలీ' హిట్.. కుర్ర దర్శకుడితో నాని మీటింగ్



రీసెంట్ టైంలో టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా నిలిచిన సినిమా 'టూరిస్ట్ ఫ్యామిలీ'. మే 1న తమిళంలో రిలీజైన ఈ చిత్రం.. దాదాపు నెలరోజుల పాటు హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో ఆకట్టుకుంది. కేవలం రూ.5 కోట్లు పెడితే రూ.75 కోట్ల మేర వసూళ్లు వచ్చాయి. ఇదే మూవీలో అభిషన్ జీవింత్ అనే కుర్రాడు దర్శకుడిగా పరిచయమయ్యాడు. తొలి మూవీతోనే టాక్ ఆఫ్ ద టౌన్ అయిపోయాడు. ఇప్పుడు ఇతడు హీరో నానిని కలిశాడు.
'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా థియేటర్లలో ఉండగానే నాని చూసి తన రివ్యూ ఇచ్చేశాడు. దర్శకుడు అభిషన్‌ని మెచ్చుకున్నాడు. నానితో పాటు రాజమౌళి కూడా ఈ మూవీకి ఫిదా అయిపోయారు. అలాంటిది ఇప్పుడు అభిషన్‌ని నాని కలవడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే సినిమా గురించి చాలా డీటైలింగ్‌గా మాట్లాడటం తనకెంతో ప్రత్యేకంగా అనిపించిందని కుర్ర డైరెక్టర్ చెప్పుకొచ్చాడు. నానిని కలవడం తనకు గౌరవంగా ఉందని కూడా అన్నాడు.
రీసెంట్ టైంలో నాని ఓవైపు హీరోగా చేస్తూనే.. 'కోర్ట్' లాంటి చిన్న సినిమాలు తీస్తూ నిర్మాతగానూ తన అభిరుచి చాటుకుంటున్నాడు. అలాంటిది ఇప్పుడు అభిషన్‌ని కలిసి మాట్లాడాడు అంటే త్వరలో వీళ్లిద్దరూ కలిసి ఏదైనా ప్రాజెక్ట్ చేసినా సరే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' మూవీ మన దగ్గర థియేటర్లలో రిలీజ్ కాలేదు. ఓటీటీలో తెలుగు వెర్షన్‌ని నేరుగా అందుబాటులోకి తీసుకొచ్చారు. చూసిన ప్రతిఒక్కరూ సినిమాకు ఫిదా అయిపోతున్నారు. చూడాలి మరి అభిషన్‌నాని కాంబో ఏమైనా సెట్ అవుతుందేమో?

# డైరెక్షన్ చేయబోతున్న పాపులర్ కమెడియన్



అర్జున్ రెడ్డి, జాతిరత్నాలు, బ్రోచేవారెవరురా, ఆర్ఆర్ఆర్ వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు రాహుల్ రామకృష్ణ . సినిమాలతో బిజీగా ఉన్న ఇతడి దృష్టి తాజాగా దర్శకత్వం మీదకు మళ్లింది. డైరెక్టర్‌గా ఓ సినిమా చేయబోతున్నానని ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రకటించాడు. అడ్వెంచర్ మూవీ తీయబోతున్నట్లు తెలిపాడు. నటనపై ఆసక్తి గలవారు వారి షో రీల్స్, రెజ్యూమ్‌లను తన మెయిల్ ఐడీకి పంపించాలని కోరాడు.

**రామకృష్ణ కెరీర్**

సైన్మా అనే షార్ట్ ఫిలింతో తొలిసారి కెమెరా ముందుకు వచ్చాడు. తరుణ్ భాస్కర్ డైరెక్ట్ చేసిన ఈ లఘుచిత్రంతోనే రాహుల్ కెరీర్ ప్రారంభించింది. జయమ్ము నిశ్చయమ్మురా మూవీలో హీరో ఫ్రెండ్ పాత్రలో కనిపించాడు. ఈ చిత్రానికి సంభాషణల రచయితగానూ పని చేశాడు. అర్జున్ రెడ్డి చిత్రంతో ఇక వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. చివరగా మనమే సినిమాలో కనిపించాడు. ఒకటీరెండు సినిమాల్లో పాటల రచయితగానూ తన ప్రతిభ చూపించాడు.

# అజిత్‌కి జోడీగా...



స్టార్ హీరో అజిత్‌కి జోడీగా శ్రీనిధీ శెట్టి నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. యశ్ హీరోగా రూపొందిన కన్నడ చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 1'తో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రీనిధీ శెట్టి. ఆ సినిమాపాన్ ఇండియా హిట్ కావడంతో ఈ బ్యూటీకి ఫుల్ క్రేజ్ నెలకొంది. ఆ తర్వాత ఆమె నటించిన 'కేజీఎఫ్: చాప్టర్ 2', తమిళ చిత్రం 'కోబ్రా' మంచి విజయాలు సాధించాయి. నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది థర్డ్ కేస్' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు శ్రీనిధి.
ఈ చిత్రంలో తనదైన నటన, యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకున్నారామె. ప్రస్తుతం తెలుగులో సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా 'తెలుసు కదా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే... అజిత్ కుమార్‌తో నటించే క్రేజీ చాన్స్‌ను శ్రీనిధి అందుకున్నట్లు టాక్. అజిత్ నటిస్తున్న 64వ సినిమాలో ఆమెను కథానాయికగా ఎంపిక చేశారని సమాచారం.
అజిత్‌తో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమా తెరకెక్కించిన అధిక్ రవిచంద్రన్ 'ఏకే 64' (వర్కింగ్ టైటిల్)కి దర్శకత్వం వహిస్తారని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ నవంబరులో ఆరంభం అవుతుందట. 2026 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి... అజిత్‌కి జోడీగా శ్రీనిధి నటిస్తారా? లేదా అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

# ముద్దు సన్నివేశం.. ఇబ్బందిపడుతూనే నటించా..



రోజా సినిమాతో మధుబాల క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. అయితే ఈ హీరోయిన్ కెరీర్ తొలినాళ్లలో తనకంటూ కొన్ని హద్దులు గీసుకుంది. ముద్దు సన్నివేశాల్లో నటించకూడదని భీష్మించుకుని కూర్చుంది. కానీ ఓ సినిమా కోసం దాన్ని బ్రేక్ చేయాల్సి వచ్చిందని చెప్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మధుబాల మాట్లాడుతూ.. నేను పెరిగిన వాతావరణం వల్ల ఆన్‌స్క్రీన్‌లో కొన్ని సన్నివేశాల్లో నటించాలంటే ఇబ్బందిగా అనిపించేది.

**సడన్‌గా ఆ సీన్‌లో..**

ఆయా సీన్లలో నటించలేక సినిమాలు వదిలేసుకున్న సందర్భాలెన్నో..! అయితే ఓ సినిమా చేస్తున్న సమయంలో ముద్దు సన్నివేశంలో నటించాలన్నారు. దీనిగురించి నాకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. షూటింగ్‌కు ముందు ఒక్కమాటైనా చెప్పలేదేంటి? అని నిలదీశాను. అప్పుడు నన్ను పక్కకు తీసుకెళ్లి.. ఈ సీన్ అవసరం.. అందుకే చేయమంటున్నాం అని బతిమాలారు.

**అసలు ఆ సీన్ అవసరమే లేదు**

ఇష్టం లేకపోయినా ఆ సన్నివేశంలో నటించాను. దాన్ని సినిమాలో ఉంచకూడదని దర్శకుడిని నేనడగలేదు. వాళ్ల ఇష్టానికే వదిలేశాను. తీరా ఆ సీన్‌కు ఎటువంటి ప్రాధాన్యత లేదని పక్కన పెట్టేశారు. అప్పుడు నాది చాలా చిన్నవయసు. కానీ, ఈ రోజుల్లో 22 ఏళ్ల అమ్మాయి కూడా చాలా తెలివిగా ఉంటున్నారు. ఏ సీన్‌కైనా రెడీ అని సాహసం చేస్తున్నారు అని చెప్పుకొచ్చింది. సినిమాల విషయానికి వస్తే మధుబాల నటించిన కన్నప్ప జూన్ 27న విడుదల కానుంది.




# ఇది ‘గద’ విజయమంటే..

## దక్షిణాఫ్రికాదే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్!

**దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు అయిదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టైటిల్ గెలుచుకుంది.**

**లార్డ్స్** : దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బవుమా సేన విజేతగా నిలిచింది. 213/2 స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సఫారీ జట్టు మరో మూడు వికెట్లు కోల్పోయి 83.4 ఓవర్లలో 285 పరుగులు చేసింది. ఐడెన్ మార్‌క్రమ్ (136) అద్భుత శతకం సాధించాడు. విజయానికి 6 పరుగుల దూరంలో ఉండగా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ చక్కటి డైవింగ్ క్యాచ్ అందుకోవడంతో అయిదో వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికే విజయం ఖాయం కావడంతో తర్వాత వచ్చిన బ్యాటర్ పని పూర్తి చేశాడు.
ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 212 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 138 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ జట్టు 207 పరుగులు చేసింది. 282 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. బౌలర్లకు సహకరించిన పిచ్‌పై ఐడెన్ మార్‌క్రమ్, తెంబా బవుమా (66) పోరాట పటిమ ప్రదర్శించారు. బవుమా ఔటైనా.. మార్‌క్రమ్ దాదాపు చివరి వరకు క్రీజులో ఉండి దక్షిణాఫ్రికా జట్టుకు చిరస్మరణీయమైన గెలుపును అందించడంలో కీలక పాత్ర పోషించాడు. 5 వికెట్ల తేడాతో లంచ్ బ్రేక్‌కు ముందే మ్యాచ్‌ను గెలిచి, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను దక్షిణాఫ్రికా జట్టు కైవసం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన ఐడెన్ మార్‌క్రమ్ ‘ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్’గా నిలిచాడు. చివరిసారిగా 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని సఫారీ జట్టు గెలుచుకుంది. ఇప్పుడు 27 ఏళ్ల తర్వాత మరోసారి ఐసీసీ టైటిల్‌ను నెగ్గింది. ఫైనల్స్‌లో ఒత్తిడికి గురై ఓడిపోతుందని తన మీద ఉన్న అపవాదును దక్షిణాఫ్రికా జట్టు ఈ విజయంతో తొలగించుకుంది.

## చరిత్ర సృష్టించిన టెంబా బావుమా.. తొలి కెప్టెన్‌గా

**27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకునేందుకు సౌతాఫ్రికా కేవలం 69 పరుగుల దూరంలో నిలిచింది. ఐకానిక్ లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ప్రోటీస్ విజయానికి చేరువైంది.**

282 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఆరంభంలో రెండు వికెట్లు కోల్పోయినప్పటికి సౌతాఫ్రికా తిరిగి పుంజుకుంది. ఐడైన్ మార్‌క్రమ్(102 బ్యాటింగ్), బావుమా(65 బ్యాటింగ్) అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నారు.
వీరిద్దరూ మూడో వికెట్‌కు 143 పరుగుల ఆజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. బావుమా ఓ వైపు గాయంతో బాధపడుతూనే తన బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో బావుమా కీలక నాక్ ఆడాడు. ఈ క్రమంలో టెంబా బావుమా ఓ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు.

**తొలి కెప్టెన్‌గా..**
డబ్ల్యూటీసీ ఫైనల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ చేసిన కెప్టెన్‌గా బావుమా నిలిచాడు. టెంబా బావుమా 3వ రోజు ముగిసే సమయానికి 121 బంతుల్లో 65 పరుగులు చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు కివీస్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ పేరిట ఉండేది. విలియమ్సన్ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో భారత్‌పై 52 పరుగులు చేశాడు. తాజా ఇన్నింగ్స్‌తో విలియమ్సన్ రికార్డును బావుమా బ్రేక్ చేశాడు.




## అనిరుధ్-కావ్య మారన్‌కి త్వరలో పెళ్లి?

**సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఏదో ఒక పెళ్లి రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. అయితే కొన్నిసార్లు నమ్మాలనిపించదు. మరికొన్నిసార్లు మాత్రం నిజంగా ప్రేమించుకుంటున్నారా? పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారు అనిపిస్తుంది. ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో అలాంటి ఓ గాసిప్ ఫుల్‌గా వైరల్ అవుతోంది. అదే లేటెస్ట్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ పెళ్లి?**

తెలుగు, తమిళంతో పాటు హిందీలోనూ మంచి పాపులారిటీ సంపాదించుకున్న అనిరుధ్.. గతంలో ఆండ్రియా, కీర్తి సురేశ్ లాంటి హీరోయిన్లతో డేటింగ్ చేశాడనే వార్తలొచ్చాయి. అందుకు సంబంధించిన ఫొటోలు కూడా కొన్ని వైరల్ అయ్యాయి. కానీ కాలక్రమేణా వాటి గురించి జనాలు మర్చిపోయారు. సడన్‌గా ఇప్పుడు సరికొత్త రూమర్స్ వినిపిస్తున్నాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకి యజమానిగా వ్యవహరిస్తున్న కావ్య మారన్‌ని అనిరుధ్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడని అంటున్నారు.
2014 నుంచి వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని, కానీ ఈ విషయం బయటపడకుండా సైలెన్స్ మెంటైన్ చేశారని.. త్వరలో మాత్రం పెళ్లి చేసుకుంటారనే పుకార్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ తమిళవాళ్లు కావడంతో ఇది నిజమేనేమోనని చాలామంది అనుకుంటున్నారు. ప్రస్తుతానికైతే ఇరువైపుల నుంచి ఎలాంటి ఖండన లేదు. అలా అని అంగీకారం కూడా లేదు. కాబట్టి ఇప్పటివరకు అయితే ఇది రూమర్ మాత్రమే.అనిరుధ్ విషయానికొస్తే టీనేజీలోనే సంగీత దర్శకుడిగా కెరీర్ ప్రారంభించాడు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మోస్ట్ పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా క్రేజ్ సొంతం చేసుకున్నాడు. కావ్య మారన్ విషయానికొస్తే.. సన్ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కూతురు. ఇప్పటికే తండ్రితోపాటు పలు వ్యాపారాల్లో కీలకంగా ఉంది. వీటితో పాటు ఐపీఎల్‌లోనూ హైదరాబాద్ జట్టుకి యజమానిగా వ్యవహరిస్తోంది.





## ‘వారిద్దరిలా అభిమానాన్ని పొందలేదు’

**ఎవరూ పట్టించుకోని పసివాడిలా భావించాను**
**ఫెడరర్, నాదల్‌లపై జొకోవిచ్ వ్యాఖ్య**
**సెర్బియా స్టార్ ప్లేయర్ అంతరంగం**



**బెల్‌గ్రేడ్:** పురుషుల టెన్నిస్‌ను దాదాపు రెండు దశాబ్దాల పాటు ఫెడరర్, నాదల్, జొకోవిచ్ శాసించారు. ఫెడరర్ 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలుచుకోగా, నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో దానిని సవరించాడు. ఆ తర్వాత జొకొవిచ్ 24 గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు సాధించి అగ్ర స్థానాన నిలిచాడు. అయితే సుదీర్ఘ కెరీర్‌లో ఫెడరర్, నాదల్ అభిమానులకు చేరువైనంతగా జొకోవిచ్ కాలేకపోయాడు. ఆట అద్భుతమే అయినా కొన్నిసార్లు కోర్టులో తన ప్రవర్తన, మాటతీరు అతని ప్రతిష్టను కొంత తగ్గించాయి.
ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు స్వయంగా జొకోవిచ్ ఈ విషయాన్ని అంగీకరించాడు. ఫెడరర్, నాదల్ తరహాలో తాను టెన్నిస్ ప్రేమికుల నుంచి తగినంత అభిమానం పొందలేకపోయానని అతను వ్యాఖ్యానించాడు. ‘నాలో ఎన్నో లోపాలు ఉండవచ్చు. అది వాస్తవం. అయితే ఎప్పుడూ మనసులో చెడు ఆలోచనలు లేకుండా మంచి ఉద్దేశంతోనే నా జీవితాన్ని గడిపాను. నాకు నచ్చినట్లుగా బతికాను.
కానీ ఫెడరర్, నాదల్‌తో పోలిస్తే చాలాసార్లు నేను ఎవరికీ అక్కర్లేని పసివాడిలా నన్ను చూశారు. ఈ కారణంగా చాలాసార్లు బాధపడ్డాను. ఎందుకు ఇలా జరుగుతోందని చాలాసార్లు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. నా ప్రవర్తన మారితే అంతా బాగుంటుందని భావించి ఆ ప్రయత్నమూ చేశాను. అయినా సఫలం కాలేకపోయాను’ అని జొకోవిచ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

**అందుకే నన్ను పట్టించుకోలేదు...**
ఫెడరర్, నాదల్‌తో పోలిస్తే తనకు తగినంత గౌరవం దక్కకపోవడానికి భౌగోళిక పరిస్థితులు కూడా ఒక కారణమని జొకోవిచ్ అభిప్రాయపడ్డాడు. యూరోప్‌లోని ప్రముఖ దేశాల నుంచి వారిద్దరు వచ్చారని, తాను వారికి సవాల్ విసరడం కొందరికి నచ్చలేదని అతను అన్నాడు. ‘నాకు గుర్తింపు రాకముందే ఫెడరర్, నాదల్ సమఉజ్జీలైన ప్రత్యర్థులుగా పోరాడుతూ వచ్చారు.
పశ్చిమాన బలమైన దేశాలైన స్విట్జర్లాండ్, స్పెయిన్‌ల నుంచి వారు వచ్చారు. కాబట్టి నాతో పోలిస్తే సహజంగానే వారికి ఎన్నో సంబంధాలు ఉన్నాయి. వీరిద్దరే గొప్ప ఆటగాళ్లు అనే కొందరి మనస్తత్వాన్ని నేను మార్చలేకపోయాను. పైగా నంబర్‌వన్‌ను అవుతాను అంటూ నేను చేసిన ప్రకటన చాలా మందికి నచ్చలేదు’ అని 38 ఏళ్ల జొకోవిచ్ గుర్తు చేసుకున్నాడు.

**వారిద్దరిపై గౌరవం ఉంది...**
ఫెడరర్, నాదల్‌లతో ఎన్నో గొప్ప మ్యాచ్‌లలో తలపడ్డానని, ఏనాడూ తప్పుగా మాట్లాడలేదని జొకో వ్యాఖ్యానించాడు. ‘మైదానంలో ప్రత్యర్థులైనంత మాత్రాన ఎవరినైనా ద్వేషిస్తామా. వారికి కీడు తలపెట్టాలని, ఏం చేసైనా ఓడించాలనే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. గెలుపు కోసమే పోరాడాం. మెరుగైన ఆటగాడే గెలిచాడు. వారిద్దరిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఒక్క చెడు మాట కూడా మాట్లాడలేదు. ఇకపై కూడా మాట్లాడను’ అని సెర్బియా స్టార్ తమ మనసులో మాట వెల్లడించాడు.

**ముగ్గురి ఆట భిన్నం...**
జొకోవిచ్ తన ఆటతో పాటు ఫెడరర్, నాదల్ ఆట గురించి కూడా విశ్లేషించాడు. ముగ్గురి ఆట భిన్నంగా ఉంటుందని అతను పోల్చాడు. ‘ఫెడరర్ చాలా ప్రతిభావంతుడు. అతని ఆట చాలా అందంగా అనిపిస్తుంది. అలవోకగా అతను కదిలి షాట్లు ఆడే తీరులో కూడా కళ కనిపిస్తుంది. నాదల్ దీనికి పూర్తిగా భిన్నం. అతని శారీరక సామర్థ్యం అసమానం. దానినే బాగా వాడుకుంటాడు. నా ఆట వీరిద్దరికి మధ్యలో ఉన్నట్లుగా ఉంటుంది. నాదల్ ప్రదర్శనతో నాకు దగ్గరి పోలికలు ఉన్నాయి. సమయం సాగుతున్నకొద్దీ మా ఆటలో మరిన్ని సొంత ప్రత్యేకతలు వచ్చి చేరాయి. ఒకరి ఆటను మరొకరు అభినందించుకుంటూ ముందుకు సాగాం. ఈ క్రమంలో మాలో పోటీతత్వం పెరిగి ఆట కూడా మరింత మెరుగైంది. వీరిద్దరితో హోరాహోరీ సమరాల్లో తలపడటం నాకు మేలు చేసింది. నా కెరీర్ ముందుకు సాగడంలో నిస్సందేహంగా వారి ప్రభావం ఉంది’ అని ఇటీవల జెనీవా ఓపెన్‌లో విజేతగా నిలిచి కెరీర్‌లో 100 సింగిల్స్ టైటిల్స్ పూర్తి చేసుకున్న జొకోవిచ్ వివరించాడు.

## ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ప్రైజ్‌మనీ ఎన్ని కోట్లంటే?

**ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 విజేతగా దక్షిణాఫ్రికా అవతరించింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన సౌతాఫ్రికా.. 27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్‌ని ముద్దాడింది. ఆసీస్ నిర్ధేశించిన 282 పరుగుల లక్ష్యాన్ని ప్రోటీస్ జట్టు కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది.**

దక్షిణాఫ్రికా బ్యాటర్లలో ఐడైన్ మార్‌క్రమ్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. 207 బంతులు ఎదుర్కొన్న మార్‌క్రమ్.. 14 ఫోర్ల సాయంతో 136 పరుగులు చేశాడు. అతడితో పాటు టెంబా బావుమా(64) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు, హాజిల్‌వుడ్, కమ్మిన్స్ తలా వికెట్ సాధించారు.

**దక్షిణాఫ్రికా ప్రైజ్‌మనీ ఎన్ని కోట్లంటే?**
ఇక వరల్డ్ ఛాంపియన్స్‌గా నిలిచిన దక్షిణాఫ్రికాకు ఎంతో ప్రైజ్‌మనీ దక్కింది, రన్నరప్ ఆస్ట్రేలియాకు ఎంతో మొత్తం లభించిందో తెలుసుకుందాం. తొలిసారి డబ్ల్యూటీసీ విజేతగా నిలిచిన ప్రోటీస్‌కు టెస్టు ఛాంపియన్ షిప్ గదతో పాటు ప్రైజ్‌మనీ కింద 3.6 మిలియన్ల డాలర్లు( భారత కరెన్సీలో సుమారు రూ.31.05 కోట్లు) లభించింది. గత రెండు ఎడిషన్‌లతో పోలిస్తే.. ప్రైజ్ మనీనీ ఈసారి రెండింతలు ఐసీసీ పెంచింది.
ఇక రన్నరప్ ఆస్ట్రేలియాకు 2.1 మిలియన్ల డాలర్ల (రూ.18.63 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కింది. ఇక డబ్యూటీసీ 202325 సైకిల్‌లో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచిన భారత జట్టుకు 1.44 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 12. 42 కోట్లు) క్యాష్‌ప్రైజ్ అందనుంది.

**డబ్ల్యూటీసీ 2025 ప్రైజ్‌మనీ వివరాలు**
**సౌతాఫ్రికా: రూ. 31.05 కోట్లు**
**ఆస్ట్రేలియా: రూ. 18.63 కోట్లు**
**ఇండియా: రూ. 12.42 కోట్లు**
**న్యూజిలాండ్: రూ. 10.35 కోట్లు**
**ఇంగ్లండ్: రూ. 8.28 కోట్లు**
**శ్రీలంక: రూ. 7.24 కోట్లు**
**బంగ్లాదేశ్: రూ. 6.21 కోట్లు**
**వెస్టిండీస్: రూ. 5.17 కోట్లు**
**పాకిస్తాన్: రూ. 4.14 కోట్లు**

